క్లుప్తంగా

విద్యార్థులకు స్టీలు కంచాల పంపిణీ

బిక్కవోలు: విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని ఊలపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వీవీ కన్నారావు అన్నారు. ఊలపల్లికి చెందిన బోడా రాజుబాబు, ఆయన సోదరులు బోడా లోవరాజు కలిసి సరోజిని ఫౌండేషన్ తరుఫున మెగా పీటీఎం సందర్భంగా బుధవారం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం చేసే 90 మంది విద్యార్థులకు స్టీలు కంచాలు పంపిణీ చేశారు. గతంలో వీరు 150 మందికి స్టీలు కంచాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్రపై శిక్షణ తరగతులు

పెదపూడి: నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న అక్షర ఆంధ్ర (ఉల్లాస్) కార్యక్రమాన్ని అధికారులు, వలంటీర్లు విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండ్రోజులపాటు నిర్వహించే అక్షర ఆంధ్ర (ఉల్లాస్) శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని అనపర్తి ఏఎంసీ చైర్మన్ జుత్తగ సూర్యకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణ, ఎఈఓ–2 సీవీవీ సత్యనారాయణ, ఉపాధి హామీ పథకం ఏపీఓ సత్యనారాయణ, వెలుగు ఏపీఎం అరుణ హాజరయ్యారు. వలంటీర్ల జిల్లా అధికారులు డిప్యూటీ డైరెక్టర్ పసుపులేటి పోసయ్య, ఏపీఓ త్రిమూర్తులు, వెలుగు సీసీలు శ్రీనివాసు, రమేష్, సూర్యకుమారి, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు ఘన సన్మానం



సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ రవీంద్రను సన్మానించిన అధికారులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన రవీంద్రను తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన రవీంద్ర తొమ్మిది నెలలు సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన కలెక్టరేట్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ సునీత, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, కార్యాలయం సిబ్బంది ఆర్‌ఐ రవీంద్రను ఘనంగా సన్మానించారు. గతంలో సీతానగరంలో పనిచేసిన ఆర్‌ఐ నవీన్ డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించేందుకు కొన్ని నెలలక్రితం వెళ్లారు. ఆర్‌ఐ నవీన్ తిరిగి మళ్లీ సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ, మండల సర్వేయర్ గౌతమ్, వీఆర్వోలు నందీశ్వరరావు, బాబురావు, గంగరాజు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు

చేపల చెరువుల లీజు వేలం వాయిదా

రంగంపేట: జి.దొంతమూరులోని చేపల చెరువుల లీజుకు సంబంధించి బుధవారం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన బహిరంగ వేలం వాయిదా వేసినట్టు కార్యదర్శి పి. శ్రీవల్లి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ స్థానిక పంచాయితీ పరిధిలో 13 చెరువులు ఉన్నాయన్నారు. వాటిలో చేపల పెంపకానికి లీజుకు ఇవ్వడానికి బహిరంగ వేలం నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. పోలీసు శాఖ అనుమతి లేనందున శాంతి భద్రతల సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున బుధవారం నిర్వహించాల్సిన వేలం వాయిదా వేసినట్టు తెలిపారు. వేలం ఎప్పుడు నిర్వహించేది పంచాయతీ ద్వారా త్వరలో తెలియజేస్తామన్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద అంబులెన్స్ దందాను అరికట్టాలి


కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వద్ద అంబులెన్స్ నిర్వాహకులు రంపచోడవరం తీసుకెళ్లేందుకు గిరిజనుల నుంచి రూ.18 వేలు వసూలు చేశారని గోదావరి అంబులెన్స్ ఓనర్లు, డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకులు బొంత శ్రీహరి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి బయట ఉన్న 20 మంది అంబులెన్స్ నిర్వాహకులు, డ్రైవర్లు శవాలను పీక్కు తినే రాబందులుగా తయారై, రోగులు, మృతుల బంధువుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తూ దారుణంగా దోపిడీ చేస్తున్నారన్నారు. గోదావరి అంబులెన్స్ సంఘంలో 170 అంబులెన్స్‌లు ఉన్నాయని, అవి రంపచోడవరానికి తీసుకెళ్లడానికి రూ.4,500 మాత్రమే వసూలు చేస్తున్నాయన్నారు. కొందరు దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వాసుపత్రి వద్దకు ఇతర అంబులెన్స్‌లను రానివ్వడం లేదన్నారు. ఈ దందాపై కలెక్టర్, ఎస్పీ వెంటనే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో అనాథ శవాలకు, నిరుపేద కుటుంబాలకు గోదావరి అంబులెన్స్ సంఘ ఉచిత సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు కరుణామయుడు బోస్, ఉపాధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి శేఖర్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వి.ప్రసాద్, సభ్యులు కె.సూరిబాబు, భానుప్రసాద్, స్వరూప్, కె.సాయి, కె.శ్రీనివాస్, మురళీ, గణపతి పాల్గొన్నారు.

పోస్టింగులల్లేవ్.. ఊస్టింగులే!

- చిరుద్యోగుల పొట్టకొట్టిన కూటమి ప్రభుత్వం
- బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు
- ఎన్నికల హామీలు గాలికొదిలేసి నిరుద్యోగులతో ఆటలు



జి.మామిడాడలో తెల్లవారుజామున వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ (ఫైల్)



జి.మామిడాడలో లబ్ధిదారులకు ఇంటివద్దకే వచ్చి రేషన్ బియ్యం, సరుకులు అందజేస్తున్న ఎండీయూ వాహనం ఆపరేటర్ (ఫైల్)

పెదపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని ఎన్నికల వేళ వల్లెవేసిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక చిరుద్యోగుల పొట్టకొట్టారు. ఏళ్ల తరబడి చిరుద్యోగాలనే నమ్ముకున్న వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త ఉద్యోగాలు కల్పించడమేమో కాని ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారు. ఎన్నికల సమయంలో కొత్త ఉద్యోగాలు కల్పిస్తామని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ఎక్కడికక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఊరూరా గడపగడపకూ తిరిగి ప్రచారం చేసిన కూటమి నాయకులు నేడు ఉద్యోగాల కల్పనపై కిమ్మనడం లేదు.

వలంటీర్ వ్యవస్థ తొలగింపుతో ప్రజలకు సత్వర సేవలు దూరం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశ వ్యాప్తంగా ఎంతో పేరుపొందింది. వలంటీర్ల ద్వారా ప్రజలకు సత్వర సేవలందేవి. కరోనా వైరస్ విజృంభణ సమయంలో వలంటీర్లు ఎనలేని సేవలు అందించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు రూ.10 వేలు ఇస్తామని, వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మాట మార్చారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి వారి కుటుంబాలను రోడ్డున పడేశారు.

ఎండీయూ వాహనాల ఆపరేటర్ల తొలగింపు

ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) వాహనాలను కూటమి ప్రభుత్వం నిలిపేయడంతో వందలాది మంది చిరుద్యోగులు వీధినపడ్డారు. వాహనాలకు ఈఎంఐలు కూడా చెల్లించలేని స్థితిలోకి ఆపరేటర్లు కొట్టుమిట్టాడుతున్నారు.ఎండీయూ వాహనాలద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులు ప్రజలకు వచ్చేవి. వృద్ధులు, కూలి పనులకు వెళ్లేవారికి, మహిళలకు ఈ విధానం ఎంతో ఉపయోగపడేది. ఎండీయూ వాహనాలను తొలగించడంతో రేషన్ సరుకుల కోసం ప్రజలు డిపోల వద్ద నేడు పడిగాపులు కాయాల్సి వస్తోంది.

ఫీల్డ్ అసిస్టెంట్లకు అన్యాయం

ఉపాధిహామీ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లను అన్యాయంగా తొలగించారు. చాలా మంది ఏలాంటి తప్పులు చేయకపోయినా భారీ జరిమానా వేస్తామని చెప్పి బలవంతంగా, చిన్న కారణాలు చూపి, అధికారులతో భయపెట్టి రాజీనామా చేయించారు.

డ్వాక్రా నిధుల గోల్‌మాల్‌కు అవకాశం

ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించకుండా డ్వాక్రా యానిమేటర్లను తొలగించారు. కనీసం సమావేశాలు పెట్టకుండానే ఇష్టారాజ్యంగా యానిమేటర్లను తొలగించినట్లు తీర్మానాలు పెట్టుకుంటున్నారు. తద్వారా గ్రామ సమాఖ్యలో నిధులు గోల్‌మాల్‌కి పాల్పడుతున్నట్లు ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ వ్యక్తులకు మద్యం విక్రయాలకు అనుమతులు ఇచ్చింది. మద్యం దుకాణాల్లో పనిచేస్తూ ఉపాధి పొందుతున్న నిరుద్యోగులు రోడ్డున పడ్డారు.

అనపర్తి నియోజకవర్గంలో తొలగించిన చిరుద్యోగుల వివరాలు

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో గ్రామ వలంటీర్లు, ఎండీయూ వాహనాలు ఆపరేటర్లు, మద్యం దుకాణాల్లో పనిచేసే సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్, యానిమేటర్లు (వీఏఏ), ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని తొలగించారు. వలంటీర్లు 1,673 మంది, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు 57, మద్యం దుకాణాల్లో సిబ్బంది 78, యానిమేటర్లు 11, ఫీల్డ్ అసిస్టెంట్లు 30 మందిని తొలగించారు.

మా కుటుంబం రోడ్డున పడింది



మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్‌గా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేస్తూ నాలుగేళ్లపైబడి పనిచేశాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కసారిగా ఎండీయూ వాహనాల ఆపరేటర్లను తొలగించడంతో ఉపాధి లేక మా కుటుంబం రోడ్డున పడింది. పేద కుటుంబాలకు చెందిన చిరుద్యోగుల పొట్టకొట్టడం దారుణం.

– ఎస్.రవిచంద్ర, ఎండీయూ ఆపరేటర్, కరకుదురు

చిరుద్యోగులను తొలగించడం అన్యాయం



గ్రామాల్లో చిరుద్యోగులగా పనిచేస్తున్న వలంటీర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తదితర చిరుద్యోగులను ఒక్కసారిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలగించడం అన్యాయం. తక్కువ వేతనాలతోనే కుటుంబాలను లాక్కొస్తున్న చిరుద్యోగులపై వేటు వేయడం దారుణం. ఉపాధి కోల్పోవడంతో చాలా కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

– ఎస్.చంటి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ఎస్సీ సెల్ కన్వీనర్

రక్షిత తాగునీరు సరఫరా చేయాలి



దోమాడ వాటర్ ట్యాంక్ వద్ద క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ అన్నామణి

పెదపూడి: గ్రామాల్లోని ప్రజలకు శుద్ధిచేసిన రక్షిత నీటిని సరఫరా చేయాలని కాకినాడ డీఎల్‌పీఓ అన్నామణి అన్నారు. దోమాడ గ్రామ పంచాయతీలో తాగునీరు రక్షిత పథకాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా సందర్శించి ట్యాంకు శుభ్రత, తాగునీటి పథకం నిర్వహణ తదిత వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ట్యాంక్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని, పరిసరాలను శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీలో పలు రికార్డులు తనిఖీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, సచివాలయం కార్యదర్శి లక్ష్మమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్, సర్పంచ్ మీనవల్లి శారదదేవి పాల్గొన్నారు.

ఆత్మహత్య పరిష్కారం కాదు

రాజానగరం: సమస్యల పరిష్కారానికి ఆత్మహత్య పరిష్కారం కాదని, అనాలోచిత నిర్ణయాలతో జీవితాన్ని అర్ధాంతరంగా ముగించుకోవడం మంచిది కాదని స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్స్ డీన్ డాక్టర్ ఎండీ ధనరాజ్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన డాక్టర్ అతిథి అభిషిక్త విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, భావోద్వేగాల నియంత్రణతోపాటు సవాళ్ల వైఫల్యాన్ని, నిరాశ, నిస్పృహలను ఏవిధంగా ఎదుర్కోవాలో అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పోస్టర్ ప్రజెంటేషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ షేక్ మీరా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రణభేరి' విజయవంతం చేయాలి



పందలపాకలో రణభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

బిక్కవోలు: తమ విద్యా, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర మంతటా నిర్వహించే రణభేరి కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని యూటీఎఫ్ ప్రతినిధులు కోరారు. పందలపాకలో బుధవారం రణభేరి కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను యూటీఎఫ్ ప్రతినిధులు ఆవిష్కరించారు. బిక్కవోలు మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.గోవిందరావు, ఎస్.సతీష్ రెడ్డి మాట్లాడుతూ తమ ఆర్థిక బకాయిల కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి జాతా నిర్వహిస్తామన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు, ప్రతినిధులు యు.అంజనీకుమార్, సీహెచ్.వీరభద్రరావు, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రంగంపేట: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, విద్యారంగ సమస్యలు, ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ సంఘ ఆధ్వర్యంలో రణభేరి కార్యక్రమం చేపట్టిందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపసరావు, అసోసియేట్ జిల్లా అధ్యక్షురాలు విజయగౌరీ, మండల శాఖ అధ్యక్షుడు కె. రాంబాబు, ప్రధాన కార్యదర్శి విజయ్‌బాబు తెలిపారు. రంగంపేట మండలం, పాత దొడ్డిగుంట హైస్కూల్లో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను వారు బుధవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి విజయరత్నం, హైస్కూలు హెచ్‌ఎం రాధారాణి, ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమార్కులపై చర్యలేవీ?



అనపర్తి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి : చట్టబద్ధమైన ఆహార భద్రత హక్కును కాలరాస్తూ పేదలకు పట్టెడు అన్నం పెట్టడానికి ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లోకి తరలిస్తూ అధికార కూటమి నాయకులు చట్టానికి తూట్లు పొడుస్తూ నిరుపేదల నోటి వద్ద కూడును లాక్కుంటున్న అక్రమార్కులపై చర్యలేవని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వృద్ధులు, కుటుంబ పోషణకు పనులు చేసుకునే వారికి ఇబ్బంది లేకుండా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే వారని, నేరుగా వాహనం ద్వారా బియ్యం, ఇతర రేషన్ సరుకులు ఇంటి ముంగిటకే రావడంతో దాదాపు అందరూ వాటిని తీసుకునే వారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎండీయూలను రద్దు చేయడంతో చాలా మంది రేషన్ షాపుల వద్ద క్యూలైన్లలో నిలబడలేక బియ్యాన్ని తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదని, దీనిని ఆసరాగా చేసుకుని అధికార పార్టీ నాయకులు బినామీల ద్వారా బియ్యాన్ని కిలో రూ.18 వరకూ చెల్లించి తీసుకుని మార్కెట్‌లో ఎక్కువ ధరకు విక్రయించి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ వ్యవహారం స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి తెలియకపోతే తక్షణమే స్పందించి ఈ వ్యవహారంలో జరుగుతున్న విషయాలను బహిర్గతం చేయాలని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి గ్రామ కన్వీనర్ నల్లమిల్లి బాల మురళీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, పొలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి పాల్గొన్నారు.

ఆలోచనలకు పదును పెట్టండి



జ్యోతిప్రజ్వలనతో వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూ, ఆలోచనలకు పదును పెడితే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంట్రడక్షన్ టు మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ ఫర్ ప్రెడిక్షన్ ఆఫ్ ప్రాపర్టీస్ ఆఫ్ మెటీరియల్స్ అనే అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రధాన భాగమైన యంత్ర అభ్యాసం ఇకపై కంప్యూటర్ శాస్త్రవేత్తలకు మాత్రమే ఒక ప్రత్యేక రంగం కాదని, ఇది సార్వత్రిక సాధనం అని పేర్కొన్నారు. మెషిన్ లెర్నింగ్‌తో మెకానికల్ ఇంజినీర్ల భవిష్యత్తే మారబోతుందన్నారు. మెషిన్ లెర్నింగ్‌పై మంచి పట్టును సాధించి, అద్భుత ఫలితాను అందుకునే దిశగా ఇటువంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, కోర్సు కోఆర్డినేటర్ కె. శ్రీహర్షరెడ్డి, అధ్యాపకులు బి.లక్ష్మి, కె. దుర్గారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పటిష్టతకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

సీటీఆర్‌ఐ: రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు కల్పించేందుకు అదనపు పోలీస్ సిబ్బంది అవసరమని ప్రభుత్వం త్వరితగతిన పోలీసు సిబ్బంది నియామకాలు చేపట్టాలని బీసీ ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సానబోయిన రామారావు కోరారు. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో శాంతిభద్రతలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కోటిపల్లి బస్టాండు సమీపంలో రాత్రి గస్తీలో ఉన్న పోలీస్ సిబ్బందిపై రౌడీ మూకలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసులకే రక్షణ కరువైతే సామాన్యుల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. దాడి జరుగుతున్న సమయంలో పోలీస్ సిబ్బంది స్టేషన్‌కి సమాచారం అందించినా సత్వరమే అక్కడికి వారు చేరుకోలేకపోవడానికి ప్రధాన కారణం సిబ్బంది, రక్షణ వాహనాల కొరతేనని అన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.రాత్రి సమయంలో బెల్ట్ షాపులు లేకుండా చర్యలు చేపట్టాలని, మద్యం దుకాణాల నిర్వహణ సమయం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్, బత్తిన ఏడుకొండలు, లాజర్ పాల్గొన్నారు.

భూపోరాటానికి నాంది పలికిన చాకలి ఐలమ్మ



గంద్రేడులో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న వెంకటరమణ

పెదపూడి: తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరనారి, స్త్రీ ధైర్యశాలి చాకలి (చిట్యాల) ఐలమ్మ అని నియోజకవర్గం రజక చైతన్య సంఘం చైర్మన్ మురమళ్ల వెంకటరమణ అన్నారు. గంద్రేడులో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఐలమ్మ తెలంగాణ రాష్ట్రం, వరంగల్ జిల్లా రాయపర్తి మండలం క్రిష్టాపురంలో 1895 సెప్టెంబర్ 26న జన్మించిందన్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రజక సంఘం ప్రతినిధులు మేడిశెట్టి సత్యనారాయణ, కడిమి గోవిందురాజు, దేవగుప్తాపు సాంబమూర్తి, దేవగుప్తాపు సత్తిబాబు (ఫైనాన్స్), ములంపాక వీరబాబు, కన్నూరిస్వామి వెలుసూరి మణికంఠ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన హెచ్‌ఎం పార్థసారథిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రంగంపేట: ఉత్తమ ఉపాధ్యాయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఆదర్శ పౌరులుగా తయారు కావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. పార్థసారథి సూచించారు. బుధవారం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అంకిత భావంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు అవార్డుల రూపంలో గుర్తింపు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన డాక్టర్ వీసీ జాకబ్, వి.రమ్యసుధతో పాటు రాజమహేంద్రవరం లయన్స్ క్లబ్ ద్వారా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథికి, గిడుగు రామమూర్తి పంతులు స్మారక రాష్ట్ర అవార్డు పొందిన తెలుగు ఉపాధ్యాయురాలు శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతి పేరమాంబను, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ, అధ్యాపక బృందం, ఎస్టీయూ సంఘం నాయకులు అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఓసిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచీపై శిక్షణ



సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ ఇస్తున్న టీఓటీ స్టీఫెన్

సీతానగరం: పంచాయతీ పురోగతి సూచీపై (పీఏఐ)పై సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కేవీఎస్‌ఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో నాగంపల్లి పంచాయతీ కార్యదర్శి స్టీఫెన్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ సమగ్ర అభివృద్ధి, పనితీరు, పురోగతిని అంచనా వేయడానికి పీఏఐ బహుళ విభాగ సూచిక వంటిదని అన్నారు. తొమ్మిది అంశాలపై పంచాయతీల పనితీరు ఆధారపడిందని, పేదరిక నిర్మూలన, జీవనోపాధుల పెంపు, ఆరోగ్యం, చిన్నారులకు అనుకూల సౌకర్యాలు, తాగునీరు, పారిశుధ్యం, పచ్చదనం, మౌలిక సదుపాల్లో స్వావలంబన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళలకు అనుకూల విధానాలు అవసరమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ సత్యం మదన్‌బాబు, వివిధ శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

వర్మీకంపోస్ట్ తయారీలో మెళకువలు పాటించాలి



వర్మీ కంపోస్ట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: చెత్త సేకరణతో తయారు చేసే వర్మీ కంపోస్ట్ విధానంపై మెళకువలు పాటించాలని అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. బుధవారం నారాయణపురం, గాదాలమ్మ నగర్‌లోని వర్మీ కంపోస్ట్ యూనిట్లను ఆయన తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు నిర్మించిన యూనిట్లు నిరుపయోగం కాకుండా సంపద సృష్టించాలన్నారు. నగరంలో ప్రస్తుతం 5 చోట్ల ఐటీసీ, గాదాలమ్మనగర్, ఎంఎస్‌ఆర్ నగర్, గెయిల్ ఆఫీస్, నారాయణపురం పార్కులో వర్మీ కంపోస్ట్ యూనిట్లు వినియోగంలో ఉన్నట్లు వెల్లడించారు. ఇంటింటికీ వెళ్లి పారిశుధ్య కార్మికులు సేకరించిన తడి చెత్తను వర్మీ కంపోస్ట్ యార్డులకి తరలించి, సేంద్రియ ఎరువుగా రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం సేంద్రియ వ్యవసాయం పట్ల రైతులు పెద్దఎత్తున మొగ్గు చూపుతున్నారన్నారు. వివిధ రకాల వానపాములను ఉపయోగించడం ద్వారా సేంద్రియ వ్యర్థాలను నిర్వహించవచ్చన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.